




## ఎంపీడీవోలు వచ్చేశారు

- 30 మండలాలకు నియామకం
- గుంటూరు జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ

నరసరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 30 మండలాలకు ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం, కృష్ణాజిల్లాకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపీడీవోలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. వీరందరిని తిరిగి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండలాలకు నియమించారు. మండలాల వారీగా ఎంపీడీవోల వివరాలు..

| పేరు | మండలం | జిల్లా |
|---|---|---|
| పీ ఉమాదేవి | అమరావతి | పల్నాడు |
| ఎన్ వెంకటేశ్వరరావు | నరసరావుపేట | పల్నాడు |
| పీ శివసుబ్రమణ్యం | అచ్చంపేట | పల్నాడు |
| షేక్ గౌసియాబేగం | బొల్లాపల్లి | పల్నాడు |
| కే సమతావాణి | దుర్గి | పల్నాడు |
| వై హనుమరెడ్డి | యడ్లపాడు | పల్నాడు |
| ఆర్‌ఈవీ ఫణికుమార్ | గురజాల | పల్నాడు |
| బీ మహేష్‌బాబు | క్రోసూరు | పల్నాడు |
| పీ పుట్టారెడ్డి | ముప్పాళ్ల | పల్నాడు |
| బీ శ్రీనివాసరెడ్డి | నకరికల్లు | పల్నాడు |
| కే నరసింహారావు | పెదకూరపాడు | పల్నాడు |
| జీ కాశయ్య | పిడుగురాళ్ల | పల్నాడు |
| కే మాథ్యూబాబు | రొంపిచర్ల | పల్నాడు |
| జీ సత్యనారాయణ | సత్తెనపల్లి | పల్నాడు |
| పీ సీతారామయ్య | శావల్యాపురం | పల్నాడు |
| ఎం శ్రీదేవి | వెల్దుర్తి | పల్నాడు |
| ఎం శోభారాణి | దాచేపల్లి | పల్నాడు |
| వై మహాలక్ష్మి | రెంటచింతల | పల్నాడు |
| టీ సుగుణమ్మ | చుండూరు | బాపట్ల |
| షేక్ మహబూబ్‌సుభాని | అమృతలూరు | బాపట్ల |
| ఐ సత్యనారాయణ | కొల్లూరు | బాపట్ల |
| జీ చంద్రశేఖరరావు | భట్టిప్రోలు | బాపట్ల |
| కే నాగలక్ష్మి | నిజాంపట్నం | బాపట్ల |
| బీ మారుతీశేషమాంబ | పిట్టలవానిపాలెం | బాపట్ల |
| కే శివపార్వతి | రేపల్లె | బాపట్ల |
| ఏ దీప్తి | తాడికొండ | గుంటూరు |
| ఏ శ్రీనివాసరావు | పొన్నూరు | గుంటూరు |
| బీ బాబురావు | చేబ్రోలు | గుంటూరు |
| పీజే విలియమ్స్ | మంగళగిరి | గుంటూరు |
| వీ విజయలక్ష్మి | కొల్లిపర | గుంటూరు |

## బాధితులకు లోకేశ్ భరోసా

- ప్రజాదర్బార్ 25వ రోజు వినతుల వెల్లువ



సమస్య పరిష్కరించాలని మంత్రి లోకేశ్‌కు అర్జీ అందిస్తున్న పీజీ విద్యార్థులు

7లో..

# హా స్టళ్లలో.. హాకారాలు

**భోజనం సక్రమంగా అందదు.. తలకు నూనె లేదు.. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. లైటు కాలిపోతే మార్చే దిక్కులేదు.. మరుగుదొడ్ల నిర్వహణ లేదు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్లలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటోన్న విద్యార్థుల పరిస్థితి. ప్రభుత్వం నుంచి భోజన బిల్లులు విడుదల కాక.. వారికి సక్రమంగా ఆహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అయినా గత వైసీపీ పాలకులు.. ప్రస్తుత కూటమి పాలకులకు పట్టడంలేదు. పిల్లల ఆకలి కేకలు చూడలేక కొందరు సంక్షేమాధికారులైన హాస్టళ్ల నిర్వాహకులు అప్పులు చేసి ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. వారు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై నిర్లక్ష్యం చూపింది. దీంతో వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకుపోయాయి. ఇక విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, ఇతర సామగ్రి, చివరకు నోటు పుస్తకాలు వసతిగృహాలు ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా ఇంతవరకు వారికి అందలేదు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలతో అల్లాడు తున్న విద్యార్థులకు గత కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.**

- అర్ధాకలితో విద్యార్థుల అవస్థలు
- జనవరి నుంచి విడుదల కాని భోజన బిల్లులు
- వసతి గృహాల బిల్లుల బకాయి రూ.10 కోట్లు పైమాటే
- కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, సామగ్రి అంతే సంగతులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా సంక్షేమం సంక్షోభమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంటోంది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. పేద విద్యార్థులపై కనికరం చూపడం లేదన్న విమర్శలు తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తోందన్న విమర్శలున్నాయి. పదో తరగతి లోపు, కళాశాల విద్యార్థులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పది వేలకుపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు ఉన్నాయి. జనవరి నుంచి భోజన బిల్లులు చెల్లించలేదు. రూ.10 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎస్సీ, బీసీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలకూ ప్రభుత్వం గండి కొడుతున్నది. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు సంబంధిత దుకాణదారులకు చెల్లించే వారు. వంద మంది విద్యార్థులు ఉన్న వసతిగృహానికి నెలకు రూ.1.40 లక్షలు భోజన బిల్లుగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆయా బిల్లులు విడుదల చేయకపోవడంతో సంక్షేమాధికారులు విద్యార్థుల ఆకలి తీర్చలేకపోతున్నారు. పైగా వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దుకాణాల్లో సరుకులు తేవాలని ప్రయత్నాలు చేస్తున్నా వారికి అప్పు పుట్టడంలేదు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో నిర్వహణ అధికారులు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపుల్లో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రానున్నది. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు పొంతన ఉండటంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1,600 చెల్లిస్తోంది. వీరికి ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. పప్పులు, కూరగాయలు నూనె, గ్యాస్ అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అయితే ఆ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహాలకు బడ్జెట్ పెంచడంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ప్రభుత్వం చెల్లించే ధరకు ఆహార పదార్థాలను అందించలేని పరిస్థితి. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని పాలకులు చెబుతున్నా ఆచరణలో ఎక్కడా కనిపించడంలేదు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం వసతి గృహాలలో భోజనానికి సంబంధించి మార్కెట్ కనుగుణంగా సరుకుల ధరలు పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది. అసలే అరకొరగా నిధులు కేటాయించినా వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఆహార పదార్థాలు సక్రమంగా అందడంలేదు.

### బియ్యం కొనుగోలుకు చేయాల్సిందే..

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తి వేసింది. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యాన్ని వసతి గృహాలకు సరఫరా చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహాల నిర్వహణ అధికారులు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ సిలెండర్ అప్పు లభించే పరిస్థితి లేదు. దీంతో దానిని కూడా నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని వసతి గృహాలకు వాటి సరఫరా నిలిచిపోయింది.

### కనీస వసతులకూ నిధులు లేవాయే

ఆహారం, కాస్మోటిక్ చార్జీలు, సామగ్రి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏదో ఒకలా జరిగిపోతుంది. అయితే వసతి గృహాల నిర్వహణకు కూడా కొన్ని నెలలుగా నిధులు విడుదల కావడంలేదు. చివరకు హాస్టల్‌లో కరెంటు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వార్డెన్లు వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, ఇతర మరమ్మతులకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదని వార్డెన్లు వాపోతున్నారు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



### కాస్మోటిక్ చార్జీలూ కష్టమే..

ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను నెలవారీగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడం లేదు. కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున చెల్లించాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీ అదనంగా విడుదల చేయాలి. అయితే ఇవేవీ ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. ఇది వారికి భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయాలి. అయితే వసతి గృహాలు తెరిచి రెండు నెలలు గడిచినా నేటి వరకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంక్ పెట్టె తదితర సామగ్రిని నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు.

నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం






# రెండో రైలు మార్గానికి సిద్ధం

- గుంటూరు - బీబీనగర్ మార్గంలో భూసేకరణ
- ఆరు గ్రామాల్లో 47.785 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- కాంపిటెంట్ అథారిటీగా గుంటూరు ఆర్డీవో.. నెల పాటు అభ్యంతరాలకు అవకాశం

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రెండో రైలుమార్గం నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రైల్వే శాఖ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు గుంటూరు పశ్చిమ, తాడికొండ, మేడికొండూరు మండలాల పరిధిలో భూసేకరణని రెవెన్యూ శాఖ చేపట్టేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా మండలాల్లోని గ్రామాల పేర్లు, సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణం భూమిని సేకరించదలిచారో పేర్కొంటూ షెడ్యూల్‌ని విడుదల చేశారు. మొత్తం ఆరు గ్రామాల్లో 47.785 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం కాంపిటెంట్ అథారిటీగా గుంటూరు ఆర్డీవో శ్రీకర్ వ్యవహరిస్తారు. భూసేకరణ విషయంలో ఎలాంటి అభ్యంతరాలున్నా 30 రోజుల వ్యవధిలో తమకు నివేదించాలని ఆయన సూచించారు.

### క్రాసింగ్ సమస్యకు చెక్..

గుంటూరు - సికింద్రాబాద్ వయా నడికుడి మార్గం ప్రస్తుతం సింగిల్ లేన్‌గా ఉన్నది. దీనిపై ఇప్పటికే 100 శాతం లైన్ కెపాసిటీ మేరకు రైళ్లు/గూడ్స్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో క్రాసింగ్ సమస్య కూడా ఉత్పన్నమౌతున్నది. ఏ కారణం చేతనైనా కాజీపేట మార్గంలో సమస్య తలెత్తితే చాలా రైళ్లు నడికుడి మార్గంలో మళ్లిస్తున్నారు. ఇది ఈ మార్గాన్ని మరింత రద్దీగా మార్చేస్తున్నది. దీంతో ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకు రైల్వే శాఖ రెండేళ్ల క్రితమే పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. 248 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ఈ రెండో మార్గాన్ని అంబరెల్లా వర్క్ కింద చేపట్టాలని నిర్ణయించింది. ప్రాజెక్టు ఖర్చు రూ.2,853.23 కోట్లుగా అంచనా వేసి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించింది. దీంతో భూసేకరణ ప్రక్రియని రైల్వే శాఖ ప్రారంభించింది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలోని సిరిపురం గ్రామంలో 30 సర్వే నెంబర్లలో 15.809 ఎకరాలు, మందపాడులో 13 సర్వే నెంబర్లలో 7.35 ఎకరాలు, విశదలలో ఒక సర్వే నెంబరులో 0.106 ఎకరాలు సేకరించనున్నారు. తాడికొండ మండలంలోని బండారుపల్లి గ్రామంలో 31 సర్వే నెంబర్లలో 9.099 ఎకరాలు, గుంటూరు పశ్చిమ మండలంలోని చినపలకలూరులో 9.463 ఎకరాలు, నల్లపాడు పరిధిలో 22 సర్వే నెంబర్లలో 5.958 ఎకరాల భూమిని సేకరించనున్నారు. సర్వే నెంబర్ల వివరాలతో గజిట్ నోటిఫికేషన్‌ని గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. అలానే స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ఈ భూసేకరణపై వచ్చే నెల 10 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఆ తర్వాత తదుపరి ప్రక్రియని చేపడతారు. ఇదేవిధంగా పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, బెల్లంకొండ, పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోనూ భూసేకరణ ప్రక్రియని అక్కడి ఆర్డీవో చేపడతారు. భూసేకరణ ప్రక్రియని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైల్వేకి అవసరమైన భూమిని స్వాధీనపరిచేందుకు రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది.

## స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

ఏర్పాట్లు పరిశీలించిన జేసీ


నరసరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబవుతుంది. వేడుకలకు సంబంధించి అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాంగణాన్ని త్రివర్ణ పతాకాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఆయా ఏర్పాట్లను జేసీ సూరజ్ మంగళవారం పరిశీలించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. వేడుకల ఆహ్వాన పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు ఇప్పటికే పంపారు. జెండా ఆవిష్కరణ అనంతరం పోలీసు శాఖ కవాతు నిర్వహించనున్నది. జిల్లా ప్రగతిని తెలియ జేసే వివిధ శాఖలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించనున్నారు. ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్ల పరిశీలన అనంతరం జేసీ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీరు సమకూర్చాలని చెప్పారు. గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై పోలీసు, ఎన్‌సీసీ విభాగాలు దృష్టి సారించాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చే అతిథులు ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు జేసీ సూచించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ సూరజ్







నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



## సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.

క్లుప్తంగా...

## ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

## ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, విహారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

## షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా ధూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

## 'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం ఆయనంక బోస్ విజువల్స్, మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



## తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

## గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

## సవాలుతో కూడుకున్న విషయం



తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.

## డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం "స్త్రీ 2' కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా.



టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.



## ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

**ఎంబీఏ:** ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్‌ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

**ఎంసీఏ:** ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/8tClgiXలో చదవండి.

## దిక్సూచి

### మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్ల స్కాలర్‌షిప్ అందిస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org



దివ్యాంగుల సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్

# బాధితులకు లోకేశ్ భరోసా

● ప్రజాదర్బార్ 25వ రోజు వినతుల వెల్లువ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం 25వ రోజు జరిగిన ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేశ్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి పరిశీలించిన మంత్రి సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలోని జామాయిల్‌తోట ప్రాంతంలో 300 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణంతోపాటు డ్రైనేజి సదుపాయం కల్పించాలని పి.సంపత్‌కుమార్ నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన తిరువీధుల నాగశ్రావణి కోరారు. రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు మృతిచెందాడని ప్రమాదబీమా చెల్లింపుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని దుగ్గిరాలకు చెందిన ఎస్ దుర్గామల్లేశ్వరి విజ్ఞప్తి చేశారు. బ్రెయిన్‌ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించడంతోపాటు పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన మహ్మద్ అబ్దుల్ ముజీబ్ విజ్ఞప్తి చేశారు. అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్న తనకు ఎలాంటి ఆధారం లేదని ఇల్లు మంజూరు చేయాలని పోలకంపాడుకు చెందిన మోక నారాయణమ్మ కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ సమయంలో షామియానాలు, డ్రింకింగ్ వాటర్ సరఫరా చేసిన తనకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని బిల్లుల మంజూరుకు ఆదేశాలు ఇవ్వాలని సిరిపల్లి నారాయణమూర్తి కోరారు. బాపట్ల జిల్లా, పర్చూరులోని బీఏఆర్ అండ్ టీవీ గవర్నమెంట్ జూనియర్ కాలేజిలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు అవసరమైన జీవో జారీచేయాలని సిబ్బంది కోరారు. విజయవాడ సిద్దార్థ వైద్యకళాశాలలో అనాటమీ విభాగానికి చెందిన హెచ్‌వోడీ డాక్టర్ చిత్ర వేధింపులకు గురి చేస్తున్నారని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పీజీ విద్యార్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. తీవ్ర అనారోగ్యం బారినపడి చికిత్స పొందిన తనకు వైద్యఖర్చులు రూ.8లక్షల వరకు అయ్యాయని, సీఎంఆర్ఎఫ్ కింద ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన మొగిలి శాంతి విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజబొమ్మంతిలోని తన 10 ఎకరాల పొలం, ఇంటి స్థలాన్ని గత ప్రభుత్వం అండతో కబ్జా చేశారని విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని రాపర్తి మాణిక్యాలరావు కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరుచేయాలని గుంటూరుకు చెందిన కె.ప్రశాంతి కోరారు. ప్రకాశం జిల్లా నాగిరెడ్డిపాలెంలో వంశపారంపర్యంగా వచ్చిన తన 1.12 ఎకరాల భూమిని గత ప్రభుత్వ అండతో కబ్జా చేశారని, తగిన న్యాయం చేయాలని గుమ్మళ్ల బ్రహ్మయ్య కోరారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్ల పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం మండలం అయినముక్కల గ్రామంలో 11మంది కలిసి కొనుగోలు చేసిన 78.71 ఎకరాలను గత ప్రభుత్వ అండతో వైకాపా నాయకులు కబ్జా చేశారని, విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా ఓబులేసుని పల్లెకు చెందిన మాగులూరి నారయ్య కోరారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో తిరిగి చేర్చేందుకు చర్యలు చేపట్టాలని బుడగ జంగం సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వ్యవసాయ మార్కెట్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేసిన తమను గత ప్రభుత్వం తొలగించిందని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిబ్బంది కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## గురజాల జీడీసీసీబీ కుంభకోణంపై రికార్డుల పరిశీలన

పిడుగురాళ్ల, ఆగస్టు 13: గురజాలలోని జీడీసీసీ బ్యాంక్‌లో రెండు రోజులుగా ఆప్కాబ్, సహకార సంఘ అధికారులు సంయుక్తంగా రికార్డులను పరిశీలించారు. సుమారు 150 మంది రైతుల పేర్లతో రూ.6కోట్ల రుణాలు పొందిన వ్యవహారంపై అన్ని కోణాలలో పరిశీలించారు. మిర్చి నిల్వవుంచిన కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించారు. మొత్తం మీద ఆప్కాబ్, సహకార సంఘ అధికారుల పరిశీలనలో మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి తగు నివేదిక పంపేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు.

## అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

● గుంటూరు జిల్లాలో 14 చోట్ల ఏర్పాటు

● లాంఛనంగా ప్రారంభించనున్న ప్రొటోకాల్ మంత్రి నారా లోకేశ్

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లు తిరిగి తెరుచుకోబోతున్నాయి. 2019 జూన్ నెల ముందువరకు మూడు పూటల పేదల కడుపు నింపి భోజనాలయాలుగా పేరుగాంచిన ఈ అన్న క్యాంటీన్‌లను వైసీపీ ప్రభుత్వం అప్పట్లో అధికారంలోకి వస్తూనే మూసేసింది. ఆ తర్వాత వాటిని పట్టించుకోకుండా శిథిలావస్థకి చేర్చింది. అన్న క్యాంటీన్‌లు ఏ పాపం చేశాయని అటు ప్రతిపక్షాలు ఇటు ప్రజలు ప్రశ్నించినా వైసీపీ నేతల కర్కశ మనసులు కరగలేదు. తెలుగుదేశం పార్టీ తరుపున దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలను కూడా అడ్డుకొనేందుకు అధికారాన్ని ఉపయోగించింది. అయినప్పటికీ చాలాచోట్ల అన్న క్యాంటీన్‌లను తాత్కాలిక ప్రదేశాల్లో తెలుగుదేశం పార్టీ నిర్వహించి పేదల ఆకలి తీరుస్తూ వచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చారు. ఆ మేరకు ఈ నెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం రోజున జిల్లాలో 14 చోట్ల అన్న క్యాంటీన్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

జిల్లాలో అమరావతి రోడ్డులోని ఐడీ హాస్పిటల్, స్వర్ణభారతీనగర్ సమీపంలోని డీటీసీ ఆఫీసు, మిర్చియార్డు, నల్లచెరువు వాటర్ ట్యాంకు, పల్నాడు బస్టాండ్, ఆర్‌టీసీ బస్టాండ్ రైతుబజార్, చుట్టుగుంట సమీపంలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత ఆర్‌టీసీ బస్టాండ్, నులకపేట, ఉండవల్లి, పొన్నూరులోని సుబ్బరాయసత్రం, తెనాలిలోని మునిసిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్, మార్కెట్‌యార్డు, ఆర్‌టీసీ కాంప్లెక్స్‌ల వద్ద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయా మునిసిపల్ కార్పొరేషన్‌లు, పురపాలక సంఘాలు పనులు చేపట్టాయి. అల్యూమినియం క్లాడింగ్ ఫినిషింగ్‌తో కొత్త లుక్‌ని తీసుకొచ్చాయి. ఒక్కో క్యాంటీన్‌లో సదుపాయాల కల్పనకు దాదాపుగా రూ.9లక్షల వరకు నిధులు వినియోగిస్తున్నట్లు మునిసిపల్ వర్గాలు తెలిపాయి. వీటిని గురువారం జిల్లా కేంద్రంలో మంత్రి నారా లోకేశ్ లాంచనంగా ప్రారంభిస్తారు. నిత్యం ఒక్కోపూట మూడువందల మందికి పైగా పేదలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కేవలం రూ.5కే రుచికరంగా వడ్డించనున్నారు.

## సురక్షిత తాగునీరందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యం

● దేచవరం జలజీవన్ మిషన్ అమలు తీరు భేష్

● కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్

నకరికల్లు, ఆగస్టు 13: ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరును అందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యమని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్ అన్నారు. మంగళవారం నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో అమృత్ సరోవర్ ట్యాంక్‌ను పరిశీలించారు. దేచవరంలో జలజీవన్ మిషన్ నిర్వహణ తీరు చక్కగా ఉందని ఆయన అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా జరిగిన అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. 2019లో ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించారని, 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాలతో సకాలంలో పనులు పూర్తికాకపోవటంతో 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ఆర్ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి 55 లీటర్లు క్లోరినేషన్ చేసిన సురక్షిత తాగునీరందించేలా పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. 0.2 పీపీఎం ఉండేలా పరీక్షలు నిర్వహించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. దేచవరంలో నిర్మించిన జలజీవన్ మిషన్ అంచనా వ్యయం రూ 76 లక్షలు కాగా పైపులైన్, వాటర్ ట్యాపుల కోసం రూ 55లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎంపీ నిధులు రూ 10లక్షల వరకు కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 1265 ట్యాప్ కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా గ్రామ ప్రజలు నూతనంగా ఏర్పాటైన బీసీ కాలనీకి, ఎస్సీ కాలనీకి ఈ పథకం వర్తింపచేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో



అమృత్ సరోవర్ ట్యాంక్ రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్

ఉంచుకొని ఓహెచ్‌ఆర్ కోసం, చెరువు కట్ట బలోపేతం కోసం రూ 70లక్షలు వరకు నిధులు కేటాయించాలని మాజీ జడ్పీటీసీ భవనం రామవరెడ్డి అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కే రత్నబాబు, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్లు తేజ్ సంగీత్, రంగారావు, డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నర్రా మమత, సర్పంచ్ నామేపల్లి ఆదిలక్ష్మి, బోడపాటి వెంకటరావు, దొండేటి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేతతో విద్యుత్‌శాఖకు షాక్

● చెల్లింపుల్లో డిస్కం పరిధిలో రూ.కోట్లలోనే వ్యత్యాసం..

● తిరిగి ఫోన్‌పే చెల్లింపులకు అవకాశం.. త్వరలో గూగుల్ పేలో కూడా..

గుంటూరు, ఆగస్టు 13: విద్యుత్‌బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులకు వినియోగదారులను ప్రోత్సహించిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఇటీవల ఆ చెల్లింపులు నిలిపివేయటంతో ఊహించని షాక్ తగిలింది. నెల రోజుల వ్యత్యాసంలోనే బిల్లుల చెల్లింపులు భారీగా తగ్గిపోవటంతో ఆ శాఖ అధికారులను ఖంగు తినిపించింది. దాంతో తిరిగా ఉన్నతాధికారులు ఫోన్‌పే చెల్లింపులు తిరిగి పునరుద్ధరించినట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు విద్యుత్‌పంపిణీ సంస్థ ఏపీసీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్‌తో పాటు ఫోన్ పేతో కూడా ఇకపై చెల్లింపులు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సాధారణంగా విద్యుత్‌రెవెన్యూ కార్యాలయాలకు వచ్చి క్యూలలో వేచి ఉండటం వంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రత్యామ్నాయ చెల్లింపులకు వినియోగదారులను ప్రోత్సహించారు. ఆన్‌లైన్ చెల్లింపులతో పాటు స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం పెరిగాక ఫోన్‌ల నుంచే బిల్లుల చెల్లింపు జరుపుకునేలా ఫోన్ పే, గూగుల్ పేలను ప్రోత్సహిస్తూ వినియోగదారులకు అవగాహన కూడా కల్పించారు. తద్వారా బిల్లుల చెల్లింపు ఎంతో సులభతరంగా మారింది. విద్యుత్‌శాఖకు కూడా సకాలంలో బిల్లుల బకాయిలు ఖజానాకు వచ్చి చేరాయి. కొన్ని సాంకేతిక కారణాలతో గత నెలాఖరున ఫోన్‌పే, గూగుల్‌పే చెల్లింపులు చెల్లవని ప్రకటించారు. దాంతో వినియోగదారుల్లో తీవ్ర గందరగోళం వ్యక్తమైంది. ఇప్పటి వరకు ఫోన్ పే, గూగుల్ పేల సాయంతో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అలవాటుపడిన వినియోగదారులు ఏపీసీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు తెలియక విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలకు పెద్దఎత్తున చేరుకున్నారు. దాంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, చెల్లింపు కేంద్రాల వద్ద చాంతాడంత క్యూ కనిపించింది. నల్లచెరువు ఈఆర్‌వో కార్యాలయం ఎదుట రెండు కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ వినియోగదారుల రద్దీ తగ్గని పరిస్థితి నెలకొన్నది. అయితే ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేత సాంకేతిక కారణాలతోనే జరిగిందని ఇందులో ఎవరి ప్రమేయం లేదని చెబుతున్నారు.

### సీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్లలోనే తేడా....

ఫోన్ పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేతతో సీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్లలోనే చెల్లింపుల బకాయిలు నిలిచిపోయినట్లు సమాచారం. సీపీడీసీఎల్ పరిధిలోని విజయవాడ, సీఆర్‌డిఏ, గుంటూరు, ఒంగోలు సర్కిల్స్ పరిధిలోని మొత్తం బకాయిలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని ఆ శాఖ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇలా అయితే పరిస్థితి తారుమారయ్యే ప్రమాదముందని ఉన్నతాధికారులు పునరాలోచనలో పడ్డారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల జోక్యంతో ఫోన్ పేతో కూడా చెల్లింపులు పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో గూగుల్‌పేతో కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపులు అందుబాటులో రానున్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

## టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ

● 0.35 ఎంయూల విద్యుత్ తయారీ: ఎస్‌ఈ వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 13: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 7.08 టీఎంసీలు కాగా మంగళవారం రాత్రి వరకు 7 టీఎంసీల నీటిని నిల్వ వుంచినట్లు ఎస్‌ఈ కొలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. ఎగువన వున్న సాగర్ నుంచి 29,800 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టు నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లు 1.5 మీటర్లు, మరో 2 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 22 వేలు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నామన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.35 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.

### ప్రకాశం బ్యారేజి దిగువకు 18 వేల క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 16వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజి వద్ద చేరుతుండటంతో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 28 వేలు, కీసర వాగు నుండి 6వేల క్యూసెక్కుల వంతున మొత్తం 34 వేల క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 18వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

### నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 11: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం మంగళవారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,347 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,30,347 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

## తెనాలిలో 250 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

తెనాలి అర్బన్, ఆగస్టు 13: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం 250 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని ఊరేగించారు. పట్టణంలోని పలు రహదారుల గుండా ర్యాలీ చేసి జాతి సమైక్యతను దేశ సమగ్రతను కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, ఏబీవీపీ గౌరవ అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశభక్తి, క్రమశిక్షణ ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని, దేశం పట్ల విధేయత లేని వారికి దేశంలో ఉండే అర్హత లేదన్నారు. 500మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటూ జైభారత్ నినాదాలతో హోరెత్తించారు. పర్యావరణ కార్యదర్శి శేష, పవన్ కుమార్, లోకేష్‌చంద్ర, హేమంతరామ్ పాల్గొన్నారు.



250 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

## బాపట్లలో రెండు రాష్ట్రాల వేదసదస్సు



రెండు రాష్ట్రాల వేదసదస్సులో పండితులు, వేద విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 13: విశ్వాన్ని నడిపించగల మహత్తరమైన సంకల్పం సర్వజగత్తును నడిపించగల శక్తి ఒక్క వేదనాదానికి ఉందని మహర్షుల భావన అని, అటువంటి వేదనాద వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఉందని పలువురు పండితులు అభిప్రాయపడ్డారు. శ్రీశంకర విద్యాలయ వ్యవస్థాపకులు శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి 145వ జయంతి ఉత్సవాలలో భాగంగా బాపట్లలోని శ్రీశంకర విద్యాలయంలోని వేదపాఠశాలలో మూడురోజులపాటు జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల వేదసదస్సులో అనేకమంది పండితులు పాల్గొని ప్రవచనాలు చేశారు. 40మంది వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సుకు కపిలవాయి రామశాస్త్రి అధ్యక్షత వహించగా గుళ్ళపల్లి చినఆంజనేయ ఘనాపాటి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. వేదనాదాలతో ప్రతిధ్వనించే ఏ క్షేత్రంలోనైనా దేవతలు కొలువై ఉంటారన్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యుత్తమ వైదిక సంస్కృతి, ఆధ్యాత్మికత విద్య, విజ్ఞాన విద్యావ్యాప్తికి ప్రబోధ ప్రచారాల ద్వారా నాటి మహాతపస్వి పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మానంద తీర్థస్వామి తెలుగు రాష్ట్రాలలో విశేషంగా కృషిచేశారని కొనియాడారు. కొన్నివేలమంది పండితులుగా తయారుకావటానికి ఈ పాఠశాలలు అందించిన విద్యాబోధన ఉపకరించిందన్నారు. కార్యక్రమంలో శ్రీశంకర విద్యాలయ వేదపాఠశాల నిర్వాహకులు శిఖరం భుజగేంద్ర మౌళి, చలపతిరావు, బి.బాబునాగేంద్ర, పండితులు పాల్గొన్నారు.

### చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరునెలల జైలు

మంగళగిరి, ఆగస్టు 13: చెల్లనిచెక్కు కేసులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.6లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే సురేష్‌బాబు మంగళవారం తీర్పును వెలువరించారు. మంగళగిరికి చెందిన కొదమల కుమార్ అనే వ్యక్తి నుంచి ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జంగా పద్మజ రూ.పది లక్షలను అప్పుగా తీసుకుని పార్ట్‌పేమెంట్ కింద 2019లో రూ.ఆరులక్షల చెక్కును ఇచ్చింది. ఈ చెక్కును కెనరా బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. ఈ మేరకు బాధితుడు కుమార్ మంగళగిరి కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేయగా వాదోపవాదాల అనంతరం న్యాయమూర్తి కే సురేష్ బాబు వైద్యురాలు పద్మజకు ఆరు నెలలపాటు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ ఆరు లక్షలను నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశాలను ఇచ్చారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.86 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 94, 102,113 |
| చికెన్ విత్ స్కిన్ | 182.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 192.00 |

## ఎన్టీఆర్ బస్టాండ్‌లో పోస్టల్ పార్శిల్ బుకింగ్ సౌకర్యం

గుంటూరు, ఆగస్టు 13: ప్రజల సౌకర్యం కోసం గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లో 24 గంటలు పోస్టల్ బుకింగ్ సౌకర్యం సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్‌ఎంఎస్ సూపరింటెండెంట్ జీవీ బాల సరస్వతి తెలిపారు. దేశంలో ఏ మారుమూల గ్రామానికైనా, ముఖ్యంగా రిజిస్టర్డ్ పార్శిల్స్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు గుంటూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ (9959126452)ను సంప్రదించాలని కోరారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బస్టాండ్‌లో పోస్టల్ పార్శిల్ బుకింగ్‌ను ప్రారంభించిన ఆర్‌ఎంఎస్ సూపరింటెండెంట్ బాలసరస్వతి తదితరులు

## జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉండాలి

● రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13: మద్యం ప్రియులకు జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉండాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నల్లపాడులోని ఐ.ఎం.ఎల్ డిపో, మద్యం దుకాణంలో తనిఖీలు చేశారు. డిపోలోని ఇండెంట్ వ్యవస్థ పనితీరు, ఆ వ్యవస్థ విధివిధానాలు, షాపుల నుండి ఇండెంట్ ఎలా పెడతారు, ఆ ఇండెంట్‌ని బట్టి స్టాక్‌ని డిపో నుండి ఎలా పంపిణీ చేస్తారన్న వివరాలను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అదేవిధంగా నల్లపాడులోని ఒక మద్యం దుకాణాన్ని సందర్శించి అక్కడ సిబ్బందిని ఏఏ పనులు చేస్తారని, ఇండెంట్ ఎలా పెడతారని, ఏఏ బ్రాండ్లు ఎక్కువ అమ్ముడుపోతున్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జి రావు, అబ్కారీ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ వెంకట్రామిరెడ్డి, అబ్కారీ సీఐలు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నల్లపాడు ఐఎంఎల్ డిపోలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎక్సైజ్ రాష్ట్ర కమిషనర్ నిశాంత్‌కుమార్, పక్కన డీసీ బాబ్జీరావ్

### పిడుగు పాటుకు వృద్ధుడి మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 13: చిలకలూరిపేట రూరల్ మండలంలోని పసుమర్రు గ్రామంలో పిడుగుపాటుకు తన్నీరు నరసింహారావు(78) మృతి చెందాడు. గ్రామంలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో నివాసం ఉంటున్న నరసింహారావు స్నానం చేస్తుండగా సమీపంలోనే పిడుగు పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

## 52,954 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 55,002 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 52,954 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 23,296 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 8000 | 17000 | 334 | 8000 | 15500 |
| నెంబరు. 5 | 8500 | 12000 | నెంబరు. 5 | 12000 | 12000 |
| 273 | 9000 | 12500 | 273 | – | – |
| 341 | 9000 | 15500 | 341 | 9000 | 15000 |
| 4884 | – | – | 4884 | 8500 | 14000 |
| సూపర్ 10 | – | – | సూపర్ 10 | – | – |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 7500 | 18700 | తేజ | 8500 | 18500 |
| బ్యాడిగి | 8500 | 16500 | బ్యాడిగి | 9500 | 14500 |
| దేవనూరుడీలక్స్ | 9500 | 15500 | దేవనూరుడీలక్స్ | 9000 | 13200 |
| తెల్లకాయలు | 4500 | 10500 | తెల్లకాయలు | 4500 | 10000 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



## మరమ్మతుల పేరుతో మెక్కేశారు!

ఎఫెక్ట్

పిడుగురాళ్ల, ఆగస్టు 13: తంగెడ, ఆకురాజుపల్లె మేజర్, పలు మైనర్ కాల్వలకు మరమ్మతుల అవకతవకలపై మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ప్రచురితమైన మరమ్మతుల పేరుతో మెక్కేశారు అనే కథనానికి సాగునీటిశాఖ అధికారులు స్పందించారు. కాల్వల మరమ్మతులకు సంబంధించి పలు రికార్డులను ఇప్పటికే నరసరావుపేట ఎస్పీ కార్యాలయంలోనే పరిశీలించిన అధికారులు ఆంధ్రజ్యోతి కథనంతో మరోసారి రికార్డులన్నీ తిరగేశారు. అప్పట్లో కాల్వల్లో మరమ్మతులు జరిగిన తీరు, ఎంబుక్‌లో నమోదైన వివరాలను సర్కిల్ కార్యాలయంలోనే అధికారులు పరిశీలించారు.

## గ్రామాలాభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలి

బెల్లంకొండ, ఆగస్టు 13: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని బెల్లంకొండ ఎంపీడీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచులు ముందుండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించి కలసిమెలసి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ ప్రణాళికపై సూచించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ

అచ్చంపేట, ఆగస్టు 13: అచ్చంపేటలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి మంగళవారం గ్రామ సర్పంచ్ ఎస్‌కే జానీ, మాజీ సర్పంచ్ కంభాల వీరబాబు యూనిఫాంతో పాటు దుస్తులను పంపిణీ చేశారు. పంచాయతీలో పనిచేస్తున్న 20 మంది సిబ్బందికి ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున వీటిని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్‌కే జానీతో పాటు మాజీ సర్పంచ్ వీరబాబు, పంచాయతీ కార్యదర్శి ఏవీ సుబ్బారావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రసాదు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల వినియోగంపై అవగాహన తప్పనిసరి

సత్తెనపల్లి, ఆగస్టు 13: ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన తప్పనిసరి అని ఏవో శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎరువులు, పురుగుమందుల వాడకం అధికంగా ఉంటుం దన్నారు. ఇలాంటి సమయంలో మార్కెట్‌లోకి నకిలీ ఎరువులు వచ్చే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోకుంటే మోసపోయే అవకాశం ఉందన్నారు. దుకాణాల్లో తక్కువ ధరకే పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తున్నారని, వాటిని కొనుగోలు చేయకూడదన్నారు. పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా షాపు యజమాని సంతకం చేసినబిల్లులు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయకూడదన్నారు. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలు, సంచులను పంట దిగుబడి చేతికి వచ్చే వరకు భద్రపరచాలన్నారు. ఒక వేళ నష్టం వస్తే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేయటానికి బిల్లులు ఉపయోగపడతాయన్నారు.

## భార్య భర్తల విభేదాలతో భర్త అదృశ్యం

● తండ్రిని జాగ్రత్తగా చూసుకోవాలంటూ సెల్ఫీ వీడియో

మాచర్లటౌన్, ఆగస్టు 13: భార్యభర్తల విభేదాలతో భర్త అదృశ్యమైన ఘటన మాచర్ల పట్టణంలో సోమవారం జరిగింది. పట్టణానికి చెందిన చక్క రాజేష్, పూర్ణిమలకు ఏడాది క్రితం వివాహమైంది. కాగా భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో సోమవారం సాయంత్రం పూర్ణిమ పట్టణ పోలీస్‌స్టేషన్లో భర్త రాజేష్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో మనస్థాపం చెందిన రాజేష్ సాయంత్రం సమయంలో తన తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలంటూ సెల్ఫీ వీడియో తీసి తన స్నేహితులకు పంపాడు. దీంతో స్నేహితులు రాజేష్ కోసం గాలించగా మంగళవారం పట్టణ శివారులోని లింగాపురం కాలనీ నాగార్జున సాగర్ కుడికాలువ వద్ద రాజేష్ ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. సోమవారం సాయంత్రం నుంచి రాజేష్ ఫోన్ అందుబాటులో లేకపోవడంతో కుడి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని స్నేహితులు బావిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి కూడా రాజేష్ ఆచూకీ లభ్యం కాలేదు. కాగా రాజేష్ తండ్రి కొండలరావు తన కుమారుడు కనిపించడం లేదని మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

## వాసవీ ఆలయ చైర్మన్‌గా నాగేశ్వరరావు



కట్టమూరి వెంకట నాగేశ్వరరావు

రెంటచింతల, ఆగస్టు 13 : రెంటచింతలలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయ చైర్మన్‌గా కట్టమూరి వెంకట నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రాత్రి సమావేశమైన ఆర్యవైశ్యులు ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన నాగేశ్వరరావును మూడోసారి ఎన్నుకున్నట్లు ప్రకటించడంపై సభ్యులందరూ ఆమోదం తెలిపారు. కార్యదర్శిగా నాళం చినబాబు, కోశాధికారిగా దేవరశెట్టి వెంకట నర్సయ్యలను ఎన్నుకున్నారు.నాగేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారికి మరోసారి సేవ చేసే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఏచూరి వెంకట సైదయ్య, గుండా రామ్మూర్తి, కట్టమూరి శ్రీనివాసరావు, నాళం సోదరులు, ఆకుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఈక్రాపు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు

క్రోసూరు, ఆగస్టు 13: 2024 - 25 ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈక్రాపు యాప్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లో పొలాల్లో ఉన్న రైతుల వద్దకు వెళ్లి ఆయన ఈక్రాపు నమోదు గురించి అవగాహన కల్పిం చారు. ఆయన వెంట గ్రామ రెవెన్యూ అధికారి ఎన్ కృష్ణారావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది కే గ్రేసు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## కష్టమైనా.. ఇష్టంతో పనిచేయాలి

● క్లాప్ మిత్రలకు సూచించిన ఐటీసీ రీసోర్స్‌పర్సన్ బుల్లయ్య



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఐటీసీ రీసోర్స్ పర్సన్ బుల్లయ్య తదితరులు

మాచవరం, ఆగస్టు 13: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్రలు చేసే పని కష్టమైనప్పటికీ ఇష్టముతో పనిచేస్తే ఫలితాలు వస్తాయని ఐటిసి రీసోర్స్ పర్సన్ బుల్లయ్య సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు జరిగిన రెండో రోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో పనిచేస్తున్న క్లాప్‌మిత్రలు చేసేపని అందరూ చేయలేరని, జీతం తక్కువైనప్పటికీ వారు చేస్తున్న పనిలో ఎంతో శ్రమ ఉందని ఆయన తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటింటికి రెండు డస్ట్‌బిన్‌లు ఇచ్చినప్పటికీ తడిచెత్త పొడిచెత్తలను వేరుచేయకుండా ఒకే డస్ట్‌బిన్‌లో కలిపి వేయడం వల్ల అది వేరుచేయడం క్లాప్‌మిత్రలకు తలనొప్పిగా మారిందని, ఇది గ్రామీణ ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, ఈవోఆర్‌డీ వెంగళరావు, ఐటీసీ కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, సర్పంచులు, కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## హిందువులపై దాడికి నిరసనగా శాంతియుత ర్యాలీ



పిడుగురాళ్లలో శాంతియుత ర్యాలీ చేస్తున్న హిందూ సంఘీయులు

పిడుగురాళ్ల, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ వానరసేన ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం రాత్రి పలువురు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, మహిళలు, చిన్నారులపై దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఇకనైనా దాడులను ఆపాలని హిందూ సంఘాలు, వానరసేన ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన రహదారిపై నిర్వహించారు.

# ఘనంగా ఎమ్మెల్యే కన్నా జన్మదిన వేడుకలు



పార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 13: సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో, టీడీపీ ప్రజావేదికలో, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌లను కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. వంద మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు చెపుతున్న జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి కన్నా లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదరణ వృద్ధాశ్రమం, పరివర్తన పాఠశాల, మొల్లమాంబ వృద్ధాశ్రమంలో కూడా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అన్నదానం చేశారు. ఏరియా వైద్యశాలల్లో కేక్‌కట్ చేసి రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్యర్యంలో గాంధీ బొమ్మల సెంటర్లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. మండలంలోని రామకృష్ణాపురంలోని బాలికల గురుకుల పాఠశాలలో కేక్‌కట్ చేసి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, మన్నెం శివనాగ మల్లేశ్వరరావు, సయ్యద్ పెద కరీముల్లా, మక్కపాటి రామచంద్రరరావు, ఆళ్ళ సాంబయ్య, ఆళ్ళ అమరేశ్వరరావు, నాగోతు శౌరయ్య, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, కోమటి నేని శ్రీనివాసరావు, నూర్ బాషా జానీబాబు, రాంబో బుడే, గౌస్, వక్కం టి అజయ్, కట్టా రమేష్, గుజ్జర్లపూడి స్టాలినీ, ఆతుకూరి నాగేశ్వరరావు, బండారు నాగరాజు, తురగా మేరీ గ్రేస్, కంభంపాటి అబ్రహం, జానీ బాషా, కటకం రామకృష్ణ, తోట అంబిక, కందిమళ్ళ రజిని, దరువూరి నాగేశ్వరరావు, ఆరేపల్లి కొండలు, బొర్రా వెంకట అప్పారావు, తవిటి భవన్నారాయణ, కొమ్మిశెట్టి సాంబశివరావు, గోగినేని కోటేశ్వరరావు, నానయ్య, రావిపాటి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

## రాజుపాలెంలో కన్నా జన్మదిన వేడుకలు



రాజుపాలెం జనసేన పార్టీ కార్యాలయంలో కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన కేక్‌ను కట్‌చేస్తున్న కూటమి నేతలు

రాజుపాలెం, ఆగస్టు 13: రాజుపాలెం మండలంలో కన్నా పుట్టిన రోజు వేడుకలను కూటమి నేతలు వైభవంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, బెల్లంకొండ సమీపంలో ఉన్న కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గోత్ర నామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య ఆధ్వర్యంలో జనసేన కార్యాలయంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నేతలు కన్నా జన్మదిన వేడుకలకు సత్తెనపల్లి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో పల్లపాటి పెద్దిరాజు, తోట నర్సయ్య, నర్రా బాబురావు, అంకాళ్ల ప్రభుదాసు, చిన్నబోయిన రాఘవరావు, అంచుల నరసింహారావు, వర్ల శ్రీను, పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, సానికొమ్ము కోటిరెడ్డి, లేపాకుల బ్రహ్మయ్య, షేక్ నాగుల్‌మీరా, షేక్ అల్లాభక్షుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఒప్పిచర్లలో పారిశుధ్యం మెరుగుపరచాలి

● ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

కారంపూడి, ఆగస్టు 13: మండలంలోని ఒప్పిచర్లలో డయేరియా నిర్మూలనకు పారిశుధ్యం మెరుగుపరచాలని గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి సూ చించారు. మంగళవారం ఆయన ఒప్పిచర్ల గ్రామాన్ని సందర్శించి అనంతరం కారంపూడి పీహెచ్‌సీలో వైద్యులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేసి పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. జీరో కేసులు వచ్చే వరకు గ్రామంలో మెడికల్ క్యాంపులు కొనసాగించాలన్నారు. పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సుధా స్రవంతి, వీఆర్వోలు కృష్ణ ప్రసాద్, రామారావు, కోటేశ్వరరావు, పలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

దుర్గి, ఆగస్టు 13: దుర్గి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను మంగళవారం గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో పలు అంశాలపై సూచనలు చేశారు. రికార్డులు తప్పులు లేకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫణీంద్రకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్‌లైన్లో కరెంట్ బిల్లులు చెల్లించవచ్చు

● విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు

కారంపూడి, ఆగస్టు 13: ఆన్‌లైన్ ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించే అవకాశం అధికారులు కల్పించారని విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా విద్యుత్ వినియోగదారులు చెల్లింపులు చేయవచ్చన్నారు. కొంతకాలం పాటు వాటి ద్వారా చెల్లింపులను నిలిపివేశారన్నారు. ఇకపై యథావిధిగా చెల్లింపులు జరుపుకునేలా అధికారులు సౌకర్యాలు కల్పించారన్నారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు : సీఐ

వెల్దుర్తి, ఆగస్టు 13: ఘర్షణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని గొట్టిపాళ్లలో ఆయన పర్యటించి గ్రామస్థులతో సమావేశమయ్యారు. చిన్న చిన్న విషయాలకు గొడవలకు దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఐ వెంట ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## సీఐ శ్రీనివాసరావుకు టీడీపీ నేతల సన్మానం

దుర్గి, ఆగస్టు 13: కారంపూడి సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును టీడీపీ మండల నేతలు సన్మానించారు. మంగళవారం కారంపూడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమం లో టీడీపీ సీనియర్ నేత వంకమళ్ల కోటేశ్వరరావు, కటకం రామారావు, ఆకుల లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిబేట్, షాట్ ఫిల్మ్ పోటీలు

మాచర్లటౌన్, ఆగస్టు 13: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం జీవ వైవిధ్య సంరక్షణలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు డిబేట్, షాట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీసీ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ షేక్ అయేషా సుల్తానా, ఎంఈవో కాంతారావు, హెచ్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌కేబీఆర్ కళాశాలలో వివేకానంద ఫొటో ప్రదర్శన

మాచర్ల రూరల్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవింద రెడ్డి ఆధ్వర్యాన పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జీవితం, సందేశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రిన్సిపాల్ జె.లక్ష్మీకుమారి ప్రారంభించారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

గురజాలటౌన్, ఆగస్టు 13: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏవో సంధ్యారాణి మండల రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులకు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర శాఖల్లోని సమాచారం కోసం ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, ఎంత రుసుం చెల్లించాలి, ఎన్ని రోజుల్లో పొందవచ్చు అనే దాని పై వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శర్మ, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**రెంటచింతల, ఆగస్టు 13:** వ్యవసాయశాఖ సిబ్బందికి రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించినట్లు ఏవో బ్రహ్మారెడ్డి చెప్పారు. 2005 చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం సమాచారాన్ని నిర్ణీత రుసుం చెల్లించి పొందవచ్చన్నారు.

## పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాల బహూకరణ



ఎంపీడీవో కార్యాలయానికి నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, ప్రవీణ్ చిత్రపటాలను తహసీల్దార్‌కు అందిస్తున్న రమేష్

పెదకూరపాడు, ఆగస్టు 13: పెదకూరపాడులోని తహసీల్దార్ కార్యాలయానికి ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ల చిత్రపటాలను తహసీల్దార్ డానియేలుకు టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మద్దినేని వెంకట సత్యనారాయణ, నెల్లూరి మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గంగవరంలో కేంద్ర బృందం పర్యటన


గురజాలటౌన్, ఆగస్టు 13: కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్, కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ ఉన్నతాధికారి మాధవ్‌లు మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో కలిసి మండలంలోని గంగవరంను సందర్శించారు. ముందుగా జలశక్తి అభియాన్ కింద ఏర్పాటు చేసిన రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో నూరు శాతం సబ్సిడీతో సాగు చేస్తున్న ఉద్యానవన పంటల్ని పరిశీలించారు. పంట సాగు, పెట్టుబడి, రాయి, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జానకి రామయ్య అకాల మృతి పార్టీకి తీరని లోటు

● డీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎంవీవీఎస్ వరప్రసాదు

పెదకూరపాడు, ఆగస్టు 13: జానకి రామయ్య అకాల మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అని డీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎంవీవీఎస్ వరప్రసాదు అన్నారు పెదకూరపాడుకు చెందిన టీడీపీ మండల నేత మన్నవ జానకి రామయ్య(78) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృత దేహాన్ని సత్తెనపల్లి మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ పెనుముచ్చు రామారావు, మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు సుభానీ మృతి



సయ్యద్ సుభానీ (ఫైల్ ఫొటో)

క్రోసూరు, ఆగస్టు 13: క్రోసూరుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు సయ్యద్ సుభానీ మృతికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సంతాపం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా సుభానీ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శిగా, పార్టీ క్రియాశీలక నాయకుడిగా సుభానీ కొనసాగుతున్నారు. సుభానీ మృతి స్థానిక టీడీపీకి తీరని లోటు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, టీడీపీ నాయకులు నలజాల కోటేశ్వరరావు, రామాంజనేయులు, మన్నెం శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, అనుమాల పూర్ణ, షేక్ ముస్తఫా, పరిశ హనుమంతరావు, మన్నెం శివయ్య తదితరులు మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

## గంగిరెడ్డిపాలెంలో కొనసాగుతున్న వైద్యశిబిరం

● మంచినీటి పరీక్షలు నిర్వహించిన వైద్యసిబ్బంది

మాచవరం, ఆగస్టు 13: మండలంలోని గంగిరెడ్డిపాలెంలో మంగళవారం కూడా వైద్యశిబిరం నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేయడం, వీధుల వెంట బ్లీచింగ్, సున్నం చల్లించడం వంటి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా ఇంటింటి సర్వే కూడా నిర్వహించారు. గ్రామంలో అక్కడక్కడ మంచినీటి పరీక్షలు కూడా నిర్వహించారు. ఈవోఆర్‌డీ వెంగళరావు, వైద్యాధికారులు ఇంటింటికి తిరిగి పరిస్థితిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిక్కా వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్లు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 13: మాచర్ల పట్టణ పురపాలక సంఘం 1, 15, 21 వార్డుల వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. మంగళవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గృహంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఒకటో వార్డు కౌన్సిలర్ గట్ల కోటిరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్లు చందు గౌడ్, 21వ వార్డు కౌన్సిలర్ ముడిశెట్టి శ్రీనివాసరావులు ఉన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మదార్‌సాహెబ్‌ల సమక్షంలో వీరు టీడీపీలో చేరారు. వారు మాట్లాడుతూ పట్టణాభివృద్ధి కోసం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆశయానికి ఆకర్షించబడి వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఇప్పటికే పదకొండు మంది వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మరో ముగ్గురు ఈ కోవలోకి చేరడంతో టీడీపీ కోరం 14కు చేరింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘానికి జరిగిన ఎన్నికల్లో పట్టణంలోని మొత్తం 31 వార్డుల్లో వైసీపీ ఏకగ్రీవం చేసింది. కాగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ బాటపట్టారు. మరికొంత మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు సంఖ్య గణనీయంగా పెరిగి మున్సిపల్ చైర్మన్ సీటును దక్కించుకునే అవకాశం మెండుగా ఉంది.

## ప్రజల ఆదరాభిమానం మరువ లేనిది : కన్నా ఫణీంద్ర



నకరికల్లులో కేక్ కట్ చేస్తున్న కన్నా ఫణీంద్ర

నకరికల్లు, ఆగస్టు 13: సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పుట్టిన రోజు వేడుకలను నకరికల్లు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నకరికల్లులోని వృక్షాంజనేయ స్వామి దేవాలయంలో కన్నా పేరుతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కన్నా ఫణీంద్ర పూజా కార్యక్రమాల్లో, అనంతరం గుండ్లపల్లిలో జరిగిన కన్నా పుట్టిన రోజు వేడుకల్లో, నకరికల్లులో జరిగిన వేడుకల్లో, నకరికల్లు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఫణీంద్ర మాట్లాడుతూ కన్నాపై ప్రజలు చూపుతున్న ఆదరాభిమానం మరువలేనిదని, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తామన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని ప్రజలందరికీ సేవ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అలీ బాషా, కాసా రామకృష్ణ, రావిళ్ళ గోపీకృష్ణ, మొక్కపాటి రామచంద్రరావు, నాదెండ్ల సత్యనారాయణ, సంగుల కొండలు, తిరుమలశెట్టి వెంకటరావు, కొనికినేని వెంకటప్పయ్య, మొక్కపాటి రామచంద్రరరావు, గోపిశెట్టి ఆంజనేయులు, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిత పాఠశాలను సందర్శించిన న్యాయమూర్తులు



భవిత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

దాచేపల్లి, ఆగస్టు 13: గురజాల న్యాయమూర్తులు మంగళవారం దాచేపల్లి మండలంలోని కేశానుపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాల, దాచేపల్లిలోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత పాఠశాలను సందర్శించారు. గురజాల సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కిలారి సత్యనారాయణలు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పోషక ఆహారం, పాఠాలు బోధిస్తున్న తరగతి గదులు, స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు, ఇతర అవసరాలపై ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తామని వివరించారు. న్యాయమూర్తులతో పాటు గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు షేక్ జానీబాష, ఎస్‌ఐ సంధ్యారాణి, పారా లీగల్ వలంటీర్లు షేక్ లాల్ అహ్మద్, ముండ్రా రామారావు, తదితరులున్నారు.

## కొత్త చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగివుండాలి

● జిల్లా ప్రొటక్షన్ అధికారి ప్రశాంత్‌కుమార్

మాచవరం, ఆగస్టు 13: ప్రస్తుత పరిస్థితుల్లో రోజు రోజుకు కొత్త కొత్త చట్టాలు పుట్టుకొస్తున్నాయని, వాటిపై విద్యార్థినులు అవగాహన కలిగివుండాలని జిల్లా ప్రొటక్షన్ అధికారి ప్రశాంత్‌కుమార్ సూచించారు. మంగళవారం పిల్లుట్లలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు చైల్డ్ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రశాంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రస్తుతం వస్తున్న కొత్త కొత్త చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చట్టాల గురించి తెలుసుకొని వారికున్న హక్కులను సాధించుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రుక్సానా, కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీత, సూపర్‌వైజర్లు కోటేశ్వరి, ప్రసన్న, అన్నపూర్ణ, అంజలి, వెంకటలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

**క్రోసూరు, ఆగస్టు 13:** బాలికల రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వణుకూరి మాధవి, షేక్ మహిమున్నీసా అన్నారు. మంగళవారం క్రోసూరులో జరిగిన భేటీ పడావో భేటీ బచావో ర్యాలీని ఉద్దేశించి వారు మాట్లాడారు. భారతీయ న్యాయ విధానంలో సెక్షన్ 63 నుంచి 99 వరకు స్త్రీలు, పిల్లల రక్షణకు సంబంధించిన చట్టాలను వివరించారన్నారు. ర్యాలీలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శివపార్వతి, ఝాన్సీ, మెరీనా తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపదను సృష్టించాలి : డీఎల్‌డీవో



శ్రీనగర్‌లోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌డీవో గబ్రూనాయక్, సర్పంచులు, ఇతర అధికారులు

దాచేపల్లి, ఆగస్టు 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో రెండో రోజు జరుగుతున్న శిక్షణా తరగతుల్లో భాగంగా అధికారులు, సర్పంచులు డంపింగ్ యార్డులను సందర్శించారు. మంగళవారం మండలంలోని శ్రీనగర్, పొందుగల గ్రామాల్లోని డంపింగ్ యార్డులను డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ నాగెండ్ల రత్నం, శిక్షణ పంచాయతీ కార్యదర్శి మంగేశ్వరరావులు పరిశీలించి పలు అంశాలను వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య సేవలు మెరుగుపరచాలని, చెత్తను సేకరించి వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చే విధానంపై అవగాహన కల్పించారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## మునిసిపల్ టెండర్లు రద్దు

● 18 పనులు నిలిపివేత
● టీడీపీ నేతల అనుమతి లేకుండా కాంట్రాక్టర్ టెండర్ దాఖలు
● అధికారులపై ఒత్తిడితో టెండర్లు రద్దు

నరసరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో ప్రగతి పనులు చేపట్టేందుకు మునిసిపాల్టీ ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు నిర్వహించింది. కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలుచేశారు. అయితే వీటిని రద్దు చేసినట్టు మునిసిపాల్టీ ప్రకటించింది. టెండర్లు రద్దుపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం 21పనులకు సంబంధించి రూ.2.72కోట్ల వ్యయం అంచనాతో టెండర్లు నిర్వహించారు. వీటిలో అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ పనులు కూడా ఉన్నాయి. క్యాంటీన్‌లకు సంబంధించిన మూడు టెండర్లు మినహా మిగిలిన 18పనులకు సంబంధించిన టెండర్లను రద్దుచేశారు. టీడీపీ నేతల ఒత్తిడి మేరకే టెండర్లు రద్దు చేశారన్న విమర్శలున్నాయి. పార్టీ నేతలకు పనులు కట్టబెట్టేందుకు యత్నించారన్న ఆరోపణలున్నాయి. టెండర్‌లు దాఖలు చేయవద్దని స్థానిక కాంట్రాక్టర్లను కొందరు నేతలు హెచ్చరించినట్టు ప్రచారం. వీరికి తెలియకుండా ఓ కాంట్రాక్టర్ సదరు పనులకు ఆన్‌లైన్ విధానంలో టెండర్లు దాఖలు చేశారు. దీంతో సదరు నేతలు ఖంగుతిన్నారు. టెండర్‌లను రద్దుచేయాలని టీడీపీ నేతలు మునిసిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చారని కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు టెండర్‌లను రద్దు చేశారు. మునిసిపల్ ఇంజనీరు కనకారావును వివరణ కోరగా సాంకేతిక కారణాలతో టెండర్లు రద్దు చేశామని తెలిపారు.


జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

## భారతదేశ ఔన్నత్యాన్ని తెలిపేందుకే హర్ ఘర్ తిరంగ

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 13: భారతదేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని తెలియజేయటానికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ బాలుర పాఠశాల నుంచి మల్లమ్మసెంటర్ వరకు 150 అడుగుల జాతీయ జెండాను స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యేడాక్టర్ చదలవాడ అరవిందబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీటీటీ సుందరి, హెచ్ఎం టీ శ్రీకాంత్, కొట్టా కిరణ్ కుమార్, కాంత్రి, ప్రసాదు, ఎంఈవో నాగేశ్వరరావు, టీ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఈవో వెనుగోపాలరావు, అంకమ్మ చౌదరి, ఎస్.మురళి, కె.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జోగి రమేష్ దుర్మార్గాలు అనేకం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 13: మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన కుటుంబ సభ్యులు అవినీతి, భూకబ్జాలు, ఎన్నో దుర్మార్గాలు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలో 14, 34 వార్డులలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మాజీమంత్రి జోగి రమేష్, ఆయన తనయుడు రాజు, తమ్ముడు వెంకటేశ్వరరావు అందరూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ధనదాహంతో ప్రజల ఆస్తులను కబ్జాలు చేశారని, అగ్రిగోల్డ్ భూమలు ఆక్రమించుకున్నారని అన్నారు. విజయవాడ వద్ద అంబాపురంలో ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను రిజిస్ట్రర్ చేసుకోగా, ఆధారాలతో సహా బయట పెట్టడం జరిగిందన్నారు. భూకబ్జాల మీద దృష్టి పెట్టామని, ఉప్పలపాడు వద్ద సాయిబాలాజీలో 46ఎకరాలు ఎసైన్డ్ భూమి ఉందన్నారు ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏదైతే దుర్మార్గాలు, అవినీతి అన్నింటిని వెలికి తీస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ మహిళా అధికార ప్రతినిధి కనుమూరి రమేష్, జనసేన, నాయకులు, కార్యక్తలు పాల్గొన్నారు.

## ముగిసిన వ్యాస రచన పోటీలు

రొంపిచర్ల, ఆగస్టు 13:రొంపిచర్ల భగత్‌సింగ్ భవన్‌లో మంగళవారం వ్యాసరచన పోటీలు ముగిశాయి దుర్వ్యసనాలు, దేశ ప్రగతిపై వాటి ప్రభావాలు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. వంద మందికి పైగా విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన అదే పాఠశాలలో బహుమతులు పంపిణీ చేయనున్నట్టు భగత్‌సింగ్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి సరికొండ రామకృష్ణంరాజు తెలిపారు.

## కొనసాగుతున్న శిక్షణ తరగతులు

రొంపిచర్ల, ఆగస్టు 13: మండల కేంద్రమైన రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజైన మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. పంచాయతీల్లో సర్పంచ్‌ల విధులు, నిర్వహణ, పంచాయతీ కార్యదర్శుల విధులు, నిర్వహణ గురించి శిక్షణ పొందిన వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట లక్ష్మీకుమారి, ఈవోపీఆర్డీ శివరామకృష్ణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య సంరక్షణ

● మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు

శావల్యాపురం, ఆగస్టు 13: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆహార పదార్థాలు తిన్నపుడే ప్రజలకు ఆరోగ్య సంరక్షణ కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మీదుర్గ పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, విత్తనశుద్ధి, నారుశుద్ధి, బీజామృతం తయారుచేసే విధానాన్ని వివరించారు. ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఇళ్ళ పక్కనుండే ఖాళీస్థలాల్లో ఘనామృతం, జీవామృతాన్ని వినియోగించి కూరగాయలు, ఆకుకూరల పెంపకాన్ని చేపట్టాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గంజిన బోయిన నారాయణమ్మ, సీసీలు ఖాజావలి, బేబీరాణి, రమాదేవి పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన పేద బ్రాహ్మణులకు ఆర్థికసాయం

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 13: మండలంలో ఇటీవల మృతిచెందిన కారుమంచి శివాలయంలో అర్చకుడు ఏకేటి నాగశ్రీరామ్మూర్తి కుటుంబాన్ని మానవ సేవాసమితి స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు మంగళవారం పరామర్శించారు. నిరాశ్రయులైన శ్రీరామ్మూర్తి కుటుంబసభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందించి వారికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో మానవ సేవాసమితి కార్య నిర్వహక అధ్యక్షుడు పీవీ సురేష్, మానవసేవాసమితి రూపకర్త చామర్తి భవానీ శంకర్, సభ్యులు హుస్సేన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా సీతారామయ్య బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, ఆగస్టు 13: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పేరుమీన సీతారామయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో భాగంగా ఈయన కురిచేడు మండలంలో ఎంపీడీవోగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటివరకు శావల్యాపురం ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన క్రొరపాటి కవితాచౌదరి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో సీతారామయ్యను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామాల అభివృదిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధిపథంలో తీర్చిదిద్దాలన్నారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ, కార్యాలయ నిర్వహణాధికారి వాణి పాల్గొన్నారు.

## పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

శావల్యాపురం, ఆగస్టు 13: రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ పర్యవేక్షణలో శావల్యాపురం పశువైద్యశాలల్లో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పశువైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, సోమల గుణధీర్ పాల్గొని 32 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్, మందులను పంపిణీ చేశారు. 46దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. వెటర్నీ అసిస్టెంట్లు బుల్లెయ్య, సుందరయ్య, ఏహెచ్ఏ బలరాం, ట్రైనీ ఏహెచ్ఏలు మేఘన, బ్రహ్మేశ్వరావు, అబ్రహం పాల్గొన్నారు.


శావల్యాపురంలో మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారులు


చిలకలూరిపేట కళా మందిర్ సెంటర్‌లో రోడ్లపై పారుతున్న మురుగు నీరు

## చిలకలూరిపేటలో భారీ వర్షం

రోడ్డుపై మోకాలి లోతున పారిన మురుగునీరు

చిలకలూరిపేట, ఆగస్టు 13: పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సుమారు గంట పాటు భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో పాటు పలుచోట్ల పిడుగులు కూడా పడ్డాయి. భారీ వర్షానికి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రోడ్లపై మురుగునీరు మోకాలి లోతున పారింది. సుబ్బయ్యతోట, బోసు రోడ్డు, కళామందిర్ సెంటర్, కృష్ణ మహల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. రోడ్లపై ఎక్కడికక్కడ ఆక్రమణలు ఉండటంతో పట్టణంలో చాలాచోట్ల కాల్వలను శుభ్రం చేసే పరిస్థితి లేదు. చాలాచోట్ల పూడిక తీసే అవకాశం కూడా లేదు. దీంతో వర్షం పడటంతో మురుగునీరు అంతా రోడ్లపై పారుతున్నది. ఈ కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం కారణంగా సుమారు గంటకు పైగా విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

## రికార్డుల స్వాధీనం కోసం పేట ఎయిడెడ్ కళాశాలకు అధికారులు


చిలకలూరిపేటలో ఎయిడెడ్ జూనియర్ కళాశాల ముందు ఇంటర్ అధికారుల పడిగాపులు

చిలకలూరిపేట, ఆగస్టు 13: పట్టణంలోని శ్రీకాసు వెంగళరెడ్డి ఎయిడెడ్ జూనియర్ కళాశాల రికార్డుల స్వాధీనానికై బాపట్ల, పల్నాడు జిల్లాల ఇంటర్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారులు పీ ఎర్రయ్య, లీలావతి మంగళవారం ఇక్కడకు వచ్చారు. ఐతే వారికి తాళాలు వేసిన కళాశాల గేట్లు

### గేటుకు తాళాలు వేసి ఉండటంతో వెనుదిరిగిన వైనం

దర్శన మిచ్చాయి. ఈ ఎయిడెడ్ కళాశాల ఈ ఏడాది మూతపడింది. ఆ కళాశాలలోని పలువురు సిబ్బంది రిటైర్ కాగా మరికొందరిని వేరే చోటకు ఇంటర్ బోర్డు బదిలీచేసింది. ఈ నేపథ్యంలో ఈ కళాశాల రికార్డులను మార్టూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వాధీనం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇద్దరు డీవైఈవోల సమక్షంలో రికార్డులు స్వాధీనం చేసుకోవటానికి మార్టూరు కళాశాల ప్రిన్సిపల్ డీవీ శ్రీనివాసరావు కూడా విచ్చేశారు. ఐతే వారికి ఈ విషయంలో చుక్కెదురైంది. రెండు ఎకరాలు విస్తీర్ణంలో 1981లో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. 1990లో కళాశాలకు ఎయిడ్ వచ్చింది. అక్కడ పనిచేసి వేరేచోట్ల విధుల్లో ఉన్న జూనియర్ లెక్చరర్ హైమావతి, రిటైర్డు జూనియర్ అసిస్టెంట్ ఏ వెంకటేశ్వర్లును కూడా అధికారులు పిలిపించారు. వెంకటేశ్వర్లు కూడా రికార్డులు అప్పగించే క్రమంలో సాయంకోసం పిలిపించారు. నోటీసులు అందుకున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అధికారుల విజ్ఞప్తికి స్పందించకపోవటంతో వారు వెనుదిగిరి పోవాల్సి వచ్చింది. కాగా ఈ కళాశాలపై కమిటీ మాజీ కార్యదర్శి తోట సత్యనారాయణ గత కొంత కాలంగా అనేక ఆరోపణలతో ఫిర్యాదులు చేశారు. హైకోర్టులో కేసులు కూడా వేశారు.

## పసుమర్రు తాగునీటి చెరువుకు ఓగేరు వాగు నీరు

● గ్రామస్థులకు పుల్లారావు సహకారం
● గ్రామంలో తొలగిన నీటి ఎద్దడి


చెరువుకు నీటిని తోడి పోస్తున్న ఎత్తిపోతల పథకం పంపు

చిలకలూరిపేట, ఆగస్టు 13: చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ తాగునీటి చెరువును ఓగేరు వాగు నీటితో నింపుతున్నారు. మేజరు పంచాయతీ ఐన పసుమర్రు గ్రామ జనాభా సుమారు తొమ్మిది వేలు. 42 ఎకరాల చెరువు ఆక్రమణలుపోను 28 ఎకరాలుగా మిగిలింది. గత కొంతకాలంగా చెరువు ఎండిపోయి గ్రామస్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న ఓగేరు వాగు నీటితో చెరువును నింపాలని తలపెట్టారు. ఇందుకోసం గుంటూరు బ్రాంచ్‌సాగర్ కాలువలోని నీటిని ఓగేరు వాగుకు వదిలారు. ఐతే నీటిని పంపింగ్ చేయటానికి అవరోధాలు ఎదురయ్యాయి. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లోని రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. గ్రామస్థులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకు వెళ్ళారు. ఆయన విజయవాడలోని వారితో మాట్లాడి విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను అద్దెకు ఇప్పించారు. దానిని విద్యుత్ శాఖ వారు తాత్కాలికంగా బిగించి విద్యుత్ సరఫరా చేశారు. దీంతో ఎత్తిపోతల పథకం పంపులు పనిచేయటం ప్రారంభమయ్యాయి. 15 రోజుల పాటు నీటిని తోడిపోస్తే చెరువు నిండే అవకాశం ఉంది. గ్రామానికి చెందిన దొడ్డా చైతన్య, గుదె రవి తేజ, కొడాలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చెరువును నింపుతున్నారు. వారికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, పంచాయతీ ఈవో శ్రీనివాసరెడ్డి సహకరిస్తున్నారు. మంగళవారం చెరువు వద్ద ఉన్న పంపింగ్ హౌస్‌లకు నీరు అందింది. దీంతో కుళాయిల ద్వారా గ్రామానికి నీటి సరఫరా ప్రారంభమైంది.

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత: టీవోఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న టీవోఎఫ్ఐ ప్రణీత్ వర్మ

ఈపూరు, ఆగస్టు 13: వాతావరణం కాలుష్యం నుంచి కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని టీవోఎఫ్ఐ మారంపల్లి ప్రణీత్‌వర్మ అన్నారు. అటవీయేతర ప్రాంతాలలో చెట్ల పెంపకంపై ఈపూరు పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. అదేవిధంగా రైతులకు ఆగ్రో ఫార్మశీపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన మొక్కలు, వరి మొక్కలు మాదిరిగానే అడవిజాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే దానివలన వచ్చే ఉపయోగాల గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, ఎం భాస్కర్, రైతులు పాల్గొన్నారు.


కుంగ్‌ఫూ, కరాటే విజేతలను అభినందిస్తున్న చిత్రం

## సీఆర్ క్లబ్‌లో కరాటే పోటీల విజేతలకు అభినందన

చిలకలూరిపేట, ఆగస్టు 13: విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో విజేతలైన వారికి మంగళవారం స్థానిక సీఆర్ క్లబ్‌లో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూ షావోలిన్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు 25మంది వివిధ విభాగాల్లో బంగారు, రజత పతకాలు పొందారు. బ్రౌన్‌బెల్టు విభాగంలో సయ్యద్ మహమ్మద్ తన్వీర్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. మొత్తం 18 బంగారు పతకాలు, ఐదు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలు విద్యార్థులు సాధించారు. మాస్టార్ బత్తుల విక్రమ్ మాట్లాడుతూ ఆత్మరక్షణకు సంబంధించిన ఈ విద్యలను ఎంతోమంది విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తున్నట్టు తెలిపారు. ఆడ పిల్లలు, మహిళలు, దాడులను ప్రతిఘటించాలని మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ వంటి విద్యలను వారికి నేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. క్లబ్ సీనియర్ సభ్యులు సాధినేని హనుమంతరావు, నర్రా కాళిదాసు, తనుబొద్ది హరిబాబురెడ్డి, డాక్టర్ లావు సతీష్, డాక్టర్ మక్కెన వంశీ కృష్ణ, స్వర్ణ శ్రీనివాస్, చేబ్రోలు మహేష్, కాళహస్తి రవిబాబు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అకాడమీ చీఫ్ ఎస్‌కే దరియావలి, మాస్టర్లు సురేష్, నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

## విత్తన శుద్ధిపై రైతులు అవగాహన పెంచుకోవాలి

జిల్లా ఏవో మురళి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 13: సాగరు ఆయకట్టు పరిధిలో వరిసాగుచేస్తున్న రైతులు విత్తన రకాలను, విత్తన శుద్ధి, నారుమళ్ల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి తెలిపారు. మండలంలోని రావిపాడులోని రైతు సేవా కేంద్రంలో రాయితీపై వరి విత్తనాలను రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ జేజీఎల్ 384 అనే వరి విత్తన రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, కేఎన్ఎమ్ 1638, ఎన్ఎల్ఆర్ 34449 రకాలపై రైతులకు అవగాహన కల్పించారు. లాంఫాం వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు వరిలోని విత్తన రకాల విత్తన శుద్ధిని నారుమళ్ల పెంపకంపై అవగాహన కల్పించినారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

శావల్యాపురం, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారిలో విద్యాసామర్థ్యాలను పెంపొందింపజేయాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని ముండ్రువారిపాలెం మెయిన్, హెచ్‌సీ, చిన్నకంచెర్ల ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా ప్రణాళికలు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. హెచ్ఎంలు ప్రవీణ్, శివప్రసాద్‌రావు, రాఘవయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో యువకుడి మృతి.. నేత్రదానం


నాగభైరు శ్రీహర్ష

చిలకలూరిపేట, ఆగస్టు 13: పట్టణంలోని 30వ వార్డుకు చెందిన టీడీపీ నాయకురాలు నాగభైరు సుబ్బాయమ్మ మనువడు నాగభైరు శ్రీహర్ష (23) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఉదయం కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా తీవ్రమైన గుండెపోటు రావటంతో ఇంటిలోనే కుప్పకూలాడు. స్థానికంగా ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు శ్రీ హర్ష నేత్రాలను దానం చేశారు. శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు వచ్చి నేత్రాలను తీసుకు వెళ్ళారు. కాగా శ్రీహర్ష భౌతికకాయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, టీడీపీ నేత షేక్ కరిముల్లా, పలువురు టీడీపీ నేతలు, కౌన్సిలర్లు సందర్శించి నివాళులర్పించారు.


చౌదరయ్య హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్

## పోటీల్లో చౌదరయ్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, ఆగస్టు 13: స్థానిక సాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన త్రోబాల్, ఖోఖో పోటీల్లో మంచి ప్రతిభ చూపారు. షాట్‌పుట్, లాంగ్ జంప్, రన్నింగ్‌లలో కూడా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. వీరిని స్కూల్ డైరెక్టర్ సీ ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ బాషా, పీఈటీ రాజు అభినందించారు.

## అంజిరెడ్డి ఆసుపత్రిలో వృద్ధునికి క్లిష్టమైన గుండె ఆపరేషన్

నరసరావుపేట లీగల్, ఆగస్టు 13: 70 సంవత్సరాల వృద్ధునికి పట్టణంలోని అంజిరెడ్డి వైద్యశాలలో క్లిష్టతరమైన గుండె ఆపరేషన్ చేసినట్లు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70సంవత్సరాల పట్టణానికి చెందిన నాగేశ్వరావు అనే వృద్ధునికి తీవ్రమైన గుండెనొప్పి రాగా వైద్యశాల కార్డియాలజిస్ట్ డాక్టర్ కోట శబరిష్ ఆధ్వర్యంలో బైపాస్ సర్జరీ చేసినట్టు తెలిపారు. రొటాబ్రేటర్ అనే అత్యాధునిక వైద్యపరికరంతో యాంజియోప్లాస్టి చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు ఆయన తెలిపారు.

### ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకుల ధర్నా

వినుకొండ, ఆగస్టు 3: గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్, మధ్యాహ్న భోజనం కార్మికులకు రాజకీయ నాయకుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ధర్నా జరిగింది. ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఈ ధర్నా జరిగింది.



## ఎస్టీ మహిళ గుడిసె దహనం హేయం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ● అగ్ని బాధితులకు సాయం


అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందచేస్తున్న ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, నూజెండ్ల, ఆగస్టు 13: టీడీపీకి ఓటు వేశారని నూజండ్ల మండలం ఉప్పలపాడు ఎస్టీ యానాది కాలనీకి చెందిన మహిళ మేకల కోటమ్మ గుడిసెను రాజకీయ కక్షతో వైసీపీ నాయకుడు దహనం చేయించటం హేయమని ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో అగ్ని బాధితురాలు కోటమ్మకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంట సామాగ్రి, దుప్పట్లు, బియ్యం, ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే జి.వి మాట్లాడుతూ బాధితురాలు కోటమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతోపాటు, ఇంటి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. రాజకీయకక్షతో వైసీపీ నాయకులు కొందరు పేదలపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం దుర్మార్గమని అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నూజండ్ల మండలం రొడ్డా వీరాంజనేయరెడ్డి, బత్తుల గోవిందరాజు, గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక దివ్యాంగులకు అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి

చిలకలూరిపేట, ఆగస్టు 13: పట్టణంలోని కుమ్మరి కాలనీ, కేవీఆర్ నగర్‌లలో ఉన్న భవిత స్కూల్‌లో మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల కోసం అవగాహన సదస్సును నిర్వహించారు. చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ స్వాతి సదస్సులో పాల్గొని మానసిక వికలాంగుల హక్కుల గురించి వివరించారు. ఎంపీడీవో కే శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగులు సదరమ్ సర్టిఫికెట్‌ను, వికలాంగుల పింఛనును పొందే విధానం గురించి వివరించారు. సదస్సులో న్యాయవాదులు పీ వెంకటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాదు, ఎం భాను ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ తప్పుడు ప్రచార ఉచ్చులో పడొద్దు

● పాడి రైతులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 13: రాష్ట్రంలో పాడి రైతులు ఎవ్వరూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాల ఉచ్చులో పడొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. పాడి రైతులను అన్ని విధాలా ప్రోత్సహించి, వారికి అదనపు ఆదాయాలు అందించి ఆలంబనగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వం సంకల్పం అన్నారు. మంగళవారం చిలకలూరిపేట 11వ వార్డు పరిధిలోని మానుకొండవారిపాలెంలో సంగం డెయిరీ పాడి రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాల ఉత్పత్తిదారులకు 8.64లక్షలు బోనస్ పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ మీద, ధూళిపాళ్ళ నరేంద్ర మీద కక్షతో వైసీపీ ప్రభుత్వహయాంలో సంగం డెయిరీని ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టాలని చూశారో అంతా గమనించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతుల్లో నింపిన విశ్వాసం కారణంగానే వాటన్నింటినీ తట్టుకొని సగర్వంగా తలెత్తుకొని నిలబడటం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత పాలకులు రాష్ట్ర పాడి పరిశ్రమ మొత్తాన్ని అమూల్‌కు కట్టబెట్టాలని చూసినా సంగం డెయిరీని కాపాడిన నాయకుడు చైర్మన్ నరేంద్ర మాత్రమేనని అభినందించారు. మానుకొండవారిపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పడిపోయే దశలో ఉందని, తక్షణమే మరో ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు.

## సాగరు జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: జేసీ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 13: పల్నాడు జిల్లా పరిధిలోని సాగరు ఆయకట్టుకు పుష్కలంగా నీరు విడుదల చేయడం జరుగుతుందని జిల్లాలోని సాగరు కుడికాలువ ఆయకట్టు పరిధిలోని గుంటూరు బ్రాంచి కెనాల్, అద్దంకి బ్రాంచి కెనాల్, ఒంగోలు బ్రాంచి కెనాల్ పరిధిలోని రైతులందరూ నీటిని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ కోరారు. సాగరు కుడికాలువ పరిధిలో సాగరు జలాలు సద్వినియోగం, తాగునీటి చెరువులు నింపడం తదితర అంశాలపై జేసీ సూరజ్ అధికారలతో సమావేశం నిర్వహించారు.

### నిరుద్యోగులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ

నరసరావుపేట రూరల్, ఆగష్టు 13: పల్నాడు జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జనరేట్ యువర్ బిజినెస్ కార్యక్రమం ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండా సంజీవరావు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు నూతన వ్యాపారం ప్రారంభించాలని ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9160200652ను సంప్రదించాలని తెలిపారు.

## మోతాదుకు మించి ఎరువులు వాడరాదు

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి

యడ్లపాడు, ఆగస్టు 13: మోతాదుకు మించి ఎరువులు వాడితే అందులోని నైట్రస్ ఆక్సైడ్ ఆవిరై వాతావరణంలో కలసి పర్యావరణానికి నష్టం కలుగచేస్తుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. ఆత్మ సహకారంతో మండలంలోని లింగారావుపాలెంలో మంగళవారం మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని మార్చుకోవడంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటకు ఎంత మేర పోషకాలు అవసరమవుతాయో అంత మోతాదులో మాత్రమే అందించాలని, అధికంగా వేసినట్లయితే అవి నిరుపయోగం కావడంతోపాటు భూమికి, పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. వరి సాగు చేసే రైతులు జేజీఎల్ 384రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 3449 వరి వంగడాలను వేసుకోవాలన్నారు. దిగుబడి, గింజ నాణ్యత జేజీఎల్ 384కు దీటుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు షేక్ హజరాబి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బాలుడు అదృశ్యంపై కేసు నమోదు


దావులూరి జాన్

నాదెండ్ల, ఆగస్టు 13: మండలంలోని నాదెండ్ల గ్రామానికి చెందిన దావులూరి జాన్ (14 సంవత్సరాలు) బాలుడు కన్పించకుండా పోయాడు. గ్రామానికి చెందిన చిన్నవీరయ్య కుమారుడైన జాన్‌కు 14సంవత్సరాలు. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ బాలుడు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం నుంచి కన్పించటం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీ పుల్లారావు కేసు నమోదు చేశారు. ఆ చూకీ తెలిసిన వారు నాదెండ్ల ఎస్ఐ 9440900881, చిలకలూరిపేట రూరల్ సీఐ 9440796268కు తెలియ జేయాలని కోరారు.

## నరసరావుపేటలో బీజేపీ హర్ ఘర్ తిరంగ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 13: నరసరావుపేట పట్టణంలో బీజేపీ అధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో ర్యాలీ మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని కోట బజారు నుంచి గడియార స్తంభం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అమరేంద్రరామకృష్ణ, ప్రధాన కార్యదర్శులు దారవెంకటసుబ్బరాయగుప్తా, కవలకుంట జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.